ఆదాయం అమోఘం.. పారిశుద్ధ్యం అధ్వానం



పంచాయతీ కార్యాలయం ఎదుట పేరుకుపోయిన చెత్తా చెదారం, గడ్డి



చెత్తా చెదారంతో నిండిన మురికి కాలువ

- ఉన్నతాధికారుల పర్యవేక్షణ తాకిడి ఎక్కువే
- కొత్తపల్లె మేజర్ గ్రామ పంచాయతీ దుస్థితి ఇదీ..

ప్రొద్దుటూరు రూరల్ : మేజర్ పంచాయతీలో కొత్తపల్లెలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. చెత్త పేరుకుపోయినా.. మురుగు కాల్వలు పొంగి ప్రవహిస్తున్నా నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో స్థానికులు దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నారు.

జిల్లాలో అతిపెద్ద మేజర్ పంచాయతీ కొత్తపల్లె గ్రామం ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి దగ్గరగా ఉండటంతో ఎక్కువ భాగం వాణిజ్య ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ పంచాయతీకి కోట్లాది రూపాయల ఆదాయ వనరులు మెండుగా ఉన్నాయి. అయితే ఆదాయానికి తగిన అభివృద్ధి జరగలేదని కొత్తపల్లె పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల పరిస్థితి అటుంచితే పంచాయతీ కార్యాలయానికి వంద మీటర్ల లోపే పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. కార్యాలయం ఎదుటే మురుగునీరు పొంగి రొడ్డుపైకి చేరుతోంది. ప్రతి నెల మూడో వారంలో డీపీఓ, డీఎల్‌పీఓలు పంచాయతీని సందర్శించి పారిశుద్ధ్య పరిస్థితి చూస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. అధ్వానంగా ఉండే ప్రాంతం గుండా వెళ్లి డీమార్ట్ సర్కిల్ వద్ద స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తూ ఫొటోలు తీసుకుని వెళ్తున్నారేగానీ, పారిశుద్ధ్యంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. డీపీఓ వచ్చినప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ తూతూమంత్రంగా చూపుతూ కాలం గడుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డిని వివరణ కోరగా పంచాయతీ కార్యాలయం ఎదుట మురికి కాలువలు నిండిపోయిన విషయం వాస్తమన్నారు. జేసీబీతో కాలువ పూడిక తీత పనులు చేసి శుభ్రం చేయిస్తామన్నారు.

తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించండి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచ్ శివలక్ష్మి

ప్రొద్దుటూరు రూరల్ : కల్లూరు పంచాయతీకి పెన్నానది నుంచి తాగునీరు సరఫరా చేసే పైపులు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో నూతన పైపులైన్ పనులు వెంటనే ప్రారంభించాలని సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి నాగేంద్రారెడ్డి కోరారు. మండల ఉపాధ్యక్షురాలు రెడ్డమ్మతో కలిసి ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డిని మంగళవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ పెన్నానది నుంచి ఇసుక ట్రాక్టర్లు స్పీడ్‌గా వెళ్లడంతో ఇరువైపులా తాగునీటి పైపులైన్ పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఈ విషయం ఎంపీడీవోకు తెలుపగా, పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్, అగ్రిమెంట్ చేయించారన్నారు. పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను అడిగితే ఎంపీడీఓ పని చేయవద్దని తెలిపారన్నారు. ఎంపీపీ శేఖర్ యాదవ్ కల్లూరులో పైపులైన్ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజల సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈకి చెప్పినా వారు పట్టించుకోవడంలేదన్నారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోతే పంచాయతీ నిధులు, దాతల సహకారంతో సర్పంచ్‌గా తానే పూర్తి చేస్తానని తెలిపారు.

రేపటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరం ఆర్టీపీపీ రోడ్డులోని ఎస్ఎం న్యూ జ్యోతి హెల్త్ క్లబ్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో గురువారం నుంచి వేసవి ఈత శిక్షణ తరగతులు ఉంటాయని నిర్వాహకుడు ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి 9.30 గంటల వరకు అనుభవజ్ఞులైన శిక్షకులతో ఈ శిక్షణ ఉంటుందని, విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9490200912 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

అడ్మిషన్లు పెంచండి

మైదుకూరు : మైదుకూరు జెడ్పీ బాలుర పాఠశాలలో అడ్మిషన్లను పెంచాలని విద్యాశాఖ జిల్లా మానిటరింగ్ అధికారి వీరేంద్ర అన్నారు. మంగళవారం ఆయన పాఠశాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను, చదువు ఆవశ్యకతను వివరించి పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి విజయభాస్కర్, హెడ్మాస్టర్ రామమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కీర్తిపల్లెలో పశువైద్య శిబిరం

ప్రొద్దుటూరు : స్థానిక పశు వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం వీరపునాయునిపల్లె మండలం కీర్తిపల్లె గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పశువులకు, మేకలకు, గొర్రెలకు వైద్య చికిత్సలు చేశారు.

రైతుల సమస్యలపై వెంటనే స్పందించాలి



రామేశ్వరం సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

ప్రొద్దుటూరు : రైతుల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. రామేశ్వరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయిలో మంగళవారం ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి వ్యవసాయ విద్యుత్తు సర్వీసులను విడుదల చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, సామాన్లు అందుబాటులో ఉన్నాయని, ఏప్రిల్, మే మాసాల్లో పని రెట్టింపుగా ఉంటుందని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో గాలులు, ఎండలు, మెరుపుల ప్రభావం విద్యుత్ వ్యవస్థపై అధికంగా ఉంటుందని, అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. క్షణం కరెంటు లేకపోయినా ప్రజలు భరించే స్థితిలో లేరని, సిబ్బంది లైన్ల వెంబడి తిరిగి సమస్య గుర్తించాలని సూచించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు రిపేర్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఈఈ రమణారెడ్డి, డీఈలు, ఏఈలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

హామీలను గాలికొదిలేసిన విద్యాశాఖమంత్రి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బద్వేలు అర్బన్ : యువగళం పాదయాత్ర సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విద్యాశాఖమంత్రి నారా లోకేష్ గాలికొదిలేశారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్ పేర్కొన్నారు. ఈ నెల 26, 27, 28వ తేదీల్లో కడపలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని అందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఓ ప్రైవేటు కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారాలోకేష్ తాము అధికారంలోకి రాగానే విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడంతో పాటు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అందజేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని మండిపడ్డారు. అలాగే పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని కోరారు. కడపలో జరగనున్న రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల్లో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు లక్ష్మణ్, చరణ్, శివప్రసాద్, తరుణ్, నరేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలో నిరు పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ మంగళవారం బీఎస్పీ ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు తీట్ల రవి కుమార్ తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది నుంచి చాలా మందికి వివాహాలు జరిగి కుటుంబం నుంచి వేరు కాపురం పెట్టుకున్నారని తెలిపారు. అలాంటి వారిలో చాలా మందికి రేషన్ కార్డులు, సొంత ఇళ్లు లేవన్నారు. వారిని అధికారులు గుర్తించి సంక్షేమ పథకాలకు ఆధారమైన రేషన్ కార్డులను, ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

బద్వేలు అర్బన్ : ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువగా బయట తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం, ఎన్‌సీడీ సీడీ సర్వేలో భాగంగా మంగళవారం తిరువెంగళాపురంలోని సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎండల్లో ఎక్కువగా తిరగడం వలన డయేరియా, అతిసార వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ప్రతిఒక్కరు జాగ్రత్తలు పాటించి డయేరియా కేసుల నివారణకు కృషి చేయాలన్నారు. తీవ్ర అతిసారకు గురైతే ఓఆర్ఎస్ ద్రావణం సేవించడం ఉత్తమమని తెలిపారు. వెంగయ్య, పిచ్చమ్మ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థకు మూల స్తంభాలు ఉపాధ్యాయులు

చాపాడు : విద్యా వ్యవస్థకు మూల స్తంభాలు ఉపాధ్యాయులేనని అలాంటి ఉపాధ్యాయ లోకంలో ఉపాధ్యాయులు సావిత్రి, రమణయ్య దంపతులు ఆదర్శంగా నిలిచారని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డా.హనుమంతరావు పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట హైస్కూల్‌లో సోషల్ స్కూల్ అసిస్టెంటుగా ఉద్యోగ విరమణ చేసిన కన్నెలూరు రమణయ్య, విశ్వనాథపురం ఎంపీపీ స్కూల్ హెడ్ టీచర్‌గా పదవీ విరమణ పొందిన రమణయ్య భార్య సావిత్రమ్మకు లక్ష్మీపేట హైస్కూల్‌లో ఉద్యోగ విరమణ వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్వాన్ డా.గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ బోధన అనేది ఒక కళ అని బోధన పరిశోధన ఉచ్ఛ్వాస, నిశ్వాసాలుగా 41 ఏళ్ల వృత్తిని గడిపిన రమణ దంపతులు ధన్యజీవులను కొనియాడారు. అనంతరం హెచ్ఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో రమణయ్య, సావిత్రమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 వంశీకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి, కేసీ కెనాల్ పీసీ వైస్ చైర్మన్ గురివిరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎస్ఐ చర్చి వార్షికోత్సవం



చర్చి వార్షికోత్సవ ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దంపతులు, సంఘ సభ్యులు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండల పరిధిలోని చిన్నగురువళూరులో సీఎస్ఐ చర్చి 55వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలను చేశారు. ఈ వేడుకలకు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, సతీమణి ప్రభావతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ అసిస్టెంట్ సెక్రటరీ పెరుమాళ్ల వినయ్‌కుమార్, మైదుకూరు డీసీ రెవ.సి.సాలమన్, రెవ.బి.రాజేంద్రప్రసాద్‌లతో పలువురు పాస్టర్లు హాజరై బైబిల్ సందేశాన్ని వినిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, శివారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు.. ఆకట్టుకున్న చెక్కభజన

సీఎస్ఐ చర్చి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు, చెక్కభజన కార్యక్రమం ఆకట్టుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించిన బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా బాలాయపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, మౌలాకు చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలువగా, కడప జిల్లా కల్లూరు శివకృష్ణ, ఖాజీపేట లక్ష్మిరెడ్డికి చెందిన ఎడ్లు ద్వితీయ, అక్కంపల్లె ఇంద్రారెడ్డి ఎడ్లు తృతీయ, ఓబుళంపల్లెకు చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి ఎడ్లు నాల్గవ, ప్రొద్దుటూరుకు కుమ్మరికొట్టాలకు చెందిన రఫీ ఎడ్లు ఐదవ, పోతిరెడ్డిపల్లె మదన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు ఆరవ, గొల్లపల్లి రామ్‌చరణ్ ఎడ్లు ఏడవ, మర్రివేము మల్లేశ్వరికి చెందిన ప్రకాశం ఎడ్లు ఎనిమిదవ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రొద్దుటూరు రూరల్ : వేసవిలో చి న్నపిల్లలు, విద్యార్థులు, ప్రజలు వడ దెబ్బకు, అతిసార వ్యాధికి గురికాకుండా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కామనూరు, కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని దొరసానిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, కొత్తపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రాంను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. వేసవిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహాలక్ష్మి, సీహెచ్ఓ కృష్ణమ్మ, బీపీ.వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీను, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాయామోపాధ్యాయుడికి సన్మానం



కత్తి వెంకటసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న రెడ్యం

ప్రొద్దుటూరు : వ్యాయామోపాధ్యాయుడిగా కత్తి వెంకటసుబ్బారెడ్డి అంకిత భావంతో పనిచేశారని ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కొనియాడారు. స్థానిక మోడంపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేసిన కత్తి వెంకటసుబ్బారెడ్డి పదవీవిరమణ కార్యక్రమాన్ని మంగళవారం ఆ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తి వెంకటసుబ్బారెడ్డి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, ఏపీపీ మార్తల సుధాకర్‌రెడ్డి, పాఠశాల ప్రదానోపాధ్యాయుడు ఇమాం హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విప్లవయోధుడు లెనిన్



లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బద్వేలు అర్బన్ : ప్రపంచానికి నూతన సమాజాన్ని పరిచయం చేసిన పోరాట యోధుడు కామ్రేడ్ వి.ఐ.లెనిన్ అని సీపీఎం పట్టణ నాయకుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారీ, బానిస వ్యవస్థకు వ్యతిరేకంగా కారల్‌మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికను రచిస్తే దానిని అనుసరించి జార్ చక్రవర్తుల రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం సాగించి రష్యా విప్లవాన్ని సాధించిన మహనీయుడు లెనిన్ అని కొనియాడారు. లెనిన్ పోరాటస్ఫూర్తిని ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు ఖైరున్‌బీ, మోక్షమ్మ, నాయకులు బాలస్వామి, ఫాతిమా, రమాదేవి, సుబ్బారెడ్డి, నారాయణమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన లబ్ధిదారులు రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు బ్యాంకు అనుసంధానంతో పీఓబీఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్వయం ఉపాధి పథకాలైన మెడికల్ షాప్, ల్యాబ్ ఎలక్ట్రికల్, బ్యాటరీ చార్జింగ్ యూనిట్, ఎలక్ట్రికల్ ఆటో, ప్యాసింజర్ కారు, గూడ్స్ ట్రక్కు, వర్మీకంపోస్టు, సోలార్ ఎనర్జీ ప్రొడక్షన్, బ్రిక్స్, జనరిక్ మెడికల్ షాపులు, బ్యూటీ పార్లర్, ఫొటో వీడియో గ్రఫీ తదితర వాటికి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. లబ్ధిదారులు 21 నుంచి 50 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలని, ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరామర్శ

కాశినాయన : మండలంలోని పాలగిరి గ్రామానికి చెందిన గజ్జలసాంబశివారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి మంగళవారం ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య పరిస్థితుల గురించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు పాటించి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక పాత మార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున రతనాల వెంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవికి విశేష పూజలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం మహిళలు పసుపు, కుంకుమ, దీపాలు, నైవేద్యంతో సామూహిక కుంకుమార్చన చేసి లలితా సహస్ర నామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

చౌకదుకాణ డీలర్లపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ గంగయ్యకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులు ఇవ్వని రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి మంగళవారం ధర్నా నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ డీలర్లు బియ్యం, నూనె, కందిపప్పు సరఫరా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొందరు డీలర్లు అంగన్‌వాడీ కార్యకర్తలతో వేలిముద్ర వేయించుకుని సరకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారన్నారు. ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తే అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వెంటనే ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేయకపోతే డీఎస్పీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామన్నారు. అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సునీత, నాగవేణి, సువార్తమ్మ, గీత, సీఐటీయూ నాయకులు బాబు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి మహిళా సంఘాల సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణమూర్తి

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయం అభివృద్ధి చెంది, ప్రతి ఒక్కరూ ఆ పద్ధతిలో వంటలను సాగు చేసేందుకు మహిళా సంఘాల సహకారం ఎంతో అవసరమని మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో కన్వర్జెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంతో మహిళా సంఘాలను అనుసంధానం చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి సుజన కుమారి మాట్లాడుతూ సాధారణ వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు ముందు సమస్యలతో కూడుకొని ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. వెలుగు ఏపీఎం జయరాజు మాట్లాడుతూ ఖరీఫ్ ప్రణాళిక అమలుకు పూర్తి స్థాయిలో సహకరిస్తామన్నారు. సమావేశంలో ఏడీపీఎం, ఎస్ఎఫ్ఏ శ్రీనాథ రెడ్డి, ఎంటీ కృష్ణారెడ్డి, వీఏఏలు, యూనిట్ ఇన్‌చార్జిలు, డీఎంఎం, సీసీలు, అనిమేటర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు సమతుల ఆహారాన్ని అందించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త కాంతిశ్రీ

మైదుకూరు : సమతుల ఆహారాన్ని అందించడం వల్ల పిల్లల్లో ఊబకాయాన్ని అదుపు చేయవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ అన్నారు. మంగళవారం వనిపెంటలోని జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త కాంతిశ్రీ మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం చేయకపోవడం, కూర్చొని సెల్‌ఫోన్ వినియోగించడం వల్ల పిల్లల్లో ఊబకాయం సమస్య ఎక్కువగా వస్తోందని పేర్కొన్నారు. దీనిని అదుపు చేయడానికి జంక్ ఫుడ్, శీతల పానియాలు తీసుకోకుండా శారీరక వ్యాయామం చేయాలన్నారు. వనిపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ వేసవిలో శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా బయటికి వెళ్లినప్పుడు నూలు వస్త్రాలతో తలకు చుట్టుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి మాట్లాడుతూ పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలి

గోపవరం : మండలంలోని ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బేతాయపల్లె, రాచాయపేట, గోపవరం, టీ.సండ్రపల్లె, ఎస్.రామాపురం గ్రామాల్లో ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం అమలవుతోందన్నారు. పీఎండీఎస్ నవధాన్యాల సాగుతో 365 రోజులు పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. ప్రతి ఇంటికి న్యూట్రిగార్డెన్స్, హోమ్ కంపోస్టింగ్ అవసరమన్నారు. నవధాన్యాల కిట్లు, న్యూట్రిగార్డెన్ల వరకు విత్తనాల ప్యాకెట్లు గ్రామ సమాఖ్య నుండి లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే జాతీయ నూనెగింజల అభివృద్ధి పథకం, జాతీయ ఆహార భద్రత మిషన్ కింద చిరుధాన్యాలు, పప్పుదినుసుల సాగు, పంటల సరళిపై అవగాహన కల్పించారు. రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య, పీఎంకిసాన్ పథకం, ఈ–పంట నమోదు, మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీతో వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు, సస్యరక్షణ పరికరాలు, ట్రాక్టర్ ఆధారిత పనిముట్లు రైతులకు అందించడం జరుగుతుందని, అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.రామకృష్ణయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, మహిళా రైతులు, వెలుగు సీసీలు, గ్రామ సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

టీచర్ల నిబద్ధతతోనే పాఠశాలల పురోగతి

మైదుకూరు : ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలు పురోగతి సాధిస్తాయని ఎంఈఓ పద్మలత అన్నారు. మంగళవారం మండలంలోని దయాంఖాన్‌పల్లె ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ పద్మలత మాట్లాడుతూ పాఠశాల హెడ్మాస్టర్ ఏవీ సుజాత నిబద్ధతతో పాఠశాల అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేశారని అభినందించారు. అందువల్లే 10 మంది విద్యార్థులు ఉన్న ఆ పాఠశాలలో ప్రస్తుతం 60 మంది దాకా పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. హెడ్మాస్టర్ సుజాత, ఉపాధ్యాయినులు శకుంతల, శాలిని సహకారంతో పాఠశాలను అభివృద్ధి పథంలో నడపడం హర్షణీయమన్నారు. హెడ్మాస్టర్ సుజాతను గ్రామ ప్రజల తరపున ఎంఈఓ సత్కరించారు. పాఠశాల తరపున హెడ్మాస్టర్ సుజాత, ఉపాధ్యాయులు ఎంఈఓ పద్మలత, జీవీ సత్రం హెడ్మాస్టర్ జయప్రకాష్ రెడ్డిలను సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వార్షిక పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పతకాలు, జ్ఞాపికలను అందజేశారు. గ్రామానికి చెందిన చంద్రకళ పాఠశాలకు బీరువాను బహూకరించారు.

ఫిజియో థెరపీతో మెరుగైన ఆరోగ్యం

ప్రొద్దుటూరు రూరల్ : ఫిజియో థెరపీతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు ఫిజియో థెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఉరుకులు, పరుగుల కాలంలో ఉద్యోగులు శరీర రుగ్మతలతో ఆస్పత్రులకు పరుగు తీయకుండా నిత్యం కొన్ని రకాల వ్యాయామాలతో ఫిజియో థెరపీ చేసుకుని ఆరోగ్య పరిరక్షణ పొందవచ్చని తెలిపారు. ఫిజియో థెరపిస్టులు సూచించే వ్యాయామాలను ప్రతి ఒక్కరూ ఆచరించి తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజాం ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఫిజియో థెరపిస్టు మహేష్, మోహన్, ఉద్యోగులు నిత్యం ఎదుర్కొనే నడుం నొప్పి, వెన్ను నొప్పి తదితర శరీర రుగ్మతల నుంచి ఉపశమనం పొందే వ్యాయామాల గురించి వివరించారు.